
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



## పేదల ఆరోగ్య సేవలకు సిఎం సహాయనిధి వరం

**శామీర్‌పేట, ఆగస్టు 20, ప్రభాతవార్త :** పేదలకు ఆరోగ్యసేవలు అందించటానికి సిఎం రిలీఫ్ ఫండ్ (వరం) దోహదపడుతుందని మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం శామీర్‌పేట మండలంలోని హకీంపేట్‌లో నివాసం ఉంటున్న ఇటబోయిన చిత్తులు అనారోగ్య సమస్యతో చికిత్స పొందుతున్నట్లు ఈ నేపథ్యంలో సిఎం రిలీఫ్‌ఫండ్ రూ.60వేలు మంజూరు కావటంతో బాధితులు ఇ.చిత్తులుకు ఆ చెక్కును జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి అందజేశారు. పేద,మధ్య తరగతి కుటుంబాల వారికి ఆరోగ్యసేవలు అందించటానికి సిఎం రిలీఫ్ ఫండ్ నిధి ఉపయోగపడుతుందని అన్నారు.బాధితులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు రాజబోయిన శ్రీనివాస్‌యాదవ్, తలగామ జగన్, వజ్జల శేషాంత్, పరానంది బాల్‌రాజ్, ఎండి జాఫర్, పాండు తదితరులు పాల్గొన్నారు.



బాధితునికి చెక్కును అందజేస్తున్న ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి





మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

## నీట్‌కు పక్కా ఏర్పాట్లు

- 30న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్
- ఉదయం 9 నుంచి 12.30గంటల వరకు..
- జిల్లాలో 19పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 7,357మంది అభ్యర్థులు
- అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20, ప్రభాతవార్త :** నీట్- పిజి- 2026 పరీక్షను సజావుగా పారదర్శకంగా నిర్వహించాలని, దీనికి సంబంధించి జిల్లాకు చెందిన ఆర్డీఓలు తగిన ఏర్పాట్లను పర్యవేక్షించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో నీట్-పిజి-2026పరీక్ష ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశంను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నీట్-పిజి-2026 పరీక్షను ఈ నెల 30వ తేదీన కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి) విధానంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు ఒకే షిఫ్టులో నిర్వహించటం జరుగుతుందన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో 19పరీక్షా కేంద్రాలు ఏర్పాటు జరిగినట్లు, ఈ పరీక్షకు 7,357మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. కీసర, మల్కాజ్‌గిరి డివిజన్ల ఆర్డీఓలు అన్ని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. నేషనల్ బోర్డు సూచించిన విధంగా అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచి పరీక్షను సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మల్కాజ్‌గిరి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్లు బందోబస్తును ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నిర్వాహణ, ఫ్రిస్కింగ్, ఎస్కార్ట్ సదుపాయాల కోసం అధికారులకు లేఖలు పంపాలన్నారు. డిఎంఅండ్‌హెచ్‌ఓ అన్ని పరీక్షా కేంద్రాల్లో వైద్య కిట్లు, అంబులెన్స్‌లు సదుపాయాలు ఏర్పాట్లు చేయాలన్నారు. టిఎస్ఆర్టీసి పరీక్షా కేంద్రాలకు తగినన్ని బస్సులు నడపాలని సూచించారు. నిరంతరం విద్యుత్ సరఫరా అందించేలా చూడాలన్నారు.

## అటవీ సంపద హాంఫట్





కలపను అక్రమంగా రాత్రి వేళల్లో తరలిస్తున్న దృశ్యం

- పచ్చని అడవిపై పగబట్టిన అక్రమార్కులు
- కుల్కచర్లలో అర్ధరాత్రి దందా
- సరిహద్దులు దాటుతున్న రూ.కోట్ల విలువ చేసే కలప
- మామూళ్ల మత్తులో అధికారులు
- చెక్‌పోస్టుల వద్ద పచ్చజెండా

**కుల్కచర్ల, జూలై 20, ప్రభాతవార్త :** ఒకవైపు ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ కోసం, అడవుల పెంపకం కోసం కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని నీళ్లలా ఖర్చు చేస్తుంటే, మరోవైపు అక్రమార్కులు మాత్రం విలువైన అటవీ సంపదను యథేచ్ఛగా దోచుకుంటున్నారు.

కుల్కచర్ల మండల వ్యాప్తంగా ఉన్న అడవుల్లో కలప అక్రమ రవాణా దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. రాత్రి వేళలు వచ్చిందంటే చాలు.. అనుమతులు లేకుండా లారీలు, ట్రాక్టర్లలో విలువైన వృక్షాలను నరికివేసి సరిహద్దులు దాటిస్తున్నారు. ముఖ్యంగా ఈ కలపను భారీగా బొగ్గు బట్టీలకు తరలిస్తూ అక్రమార్కులు రూ.కోట్లు గడిస్తున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాల్టా చట్ట నిబంధనలను బొందపెడుతూ జరుగుతున్న ఈ దోపిడీపై అటవీ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కలప అక్రమ రవాణాదారుల నుంచి ప్రతి నెలా భారీగా ముడుపులు ముట్టుతుండటంతోనే అధికారులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాత్రిపూట చెక్‌పోస్టులు, తనిఖీలు నామమాత్రంగానే సాగుతున్నాయని, కింది స్థాయి సిబ్బంది వసూళ్లకు పాల్పడి వాహనాలను వదిలేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అటవీ సంపద కళ్లముందే నాశనమవుతున్నా అధికారులు తగిన రీతిలో స్పందించకపోవడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ అక్రమ రవాణాపై సమగ్ర విచారణ జరిపించాలని, సూత్రధారులతో పాటు విధుల్లో నిరక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుల్కచర్ల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఓటర్ల సవరణపై కలెక్టర్ సీరియస్

- నో మ్యాపింగ్, అనామలీస్ ఉన్న ఓటర్లకు నోటీసులు
- నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు
- వికారాబాద్ కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశం




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారీ

**వికారాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా జిల్లాలో నో మ్యాపింగ్, అనామలీస్‌గా గుర్తించిన ఓటర్లకు తక్షణమే నోటీసులు జారీ చేసి, విచారణ వేగవంతం చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా ఏఈఆర్‌ఓ లను కేటాయించి, కొత్త లాగిన్లు ఏర్పాటు చేయాలన్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లకు ఏడు రోజుల వ్యవధి ఇచ్చి, నిర్ణీత విధానంలో సమగ్ర విచారణ చేపట్టాలని సూచించారు. సమగ్ర సర్వేలో ఎలాంటి నిరక్ష్యం వహించినా కఠిన చర్య లు ఉంటాయని, ఎంపీడీఓలు, తహసీల్దార్లు పరస్పర సమన్వయంతో నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**సంక్షేమ పథకాల పరిశీలనలో పారదర్శకత**

ఓటర్ల సవరణ అనంతరం చేయూత పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలనపై కలెక్టర్ ఎంపీడీఓలతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే లక్ష్యమని, క్షేత్రస్థాయిలో పూర్తి పారదర్శకతతో విచారణ జరపాలని చెప్పారు. అర్హత ఉండి కూడా సాంకేతిక కారణాల వల్ల పింఛన్ లభించని వారి వివరాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను గ్రామస్థాయిలో క్షేత్రపరిశీలన చేసి, ఎటువంటి జాప్యం లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఎంపీడీఓలకు నిర్దేశించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటాచారి, జడ్పీ సీఈఓ సుధీర్, డీఆర్డీఓ స్వర్ణలత, ఆర్టీఓ వాసు చంద్రతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

**రుణ లక్ష్యాలను అధిగమించాలి**

బ్యాంకులకు నిర్దేశించిన రుణ లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్ దీపక్ తివారి బ్యాంకర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు బ్యాంకర్ల జిల్లా సంప్రదింపుల, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ వడుతూ, ప్రభుత్వ పథకాలకు ప్రాధాన్యత కల్పిస్తూ బ్యాతంకర్లు ముందుకు సాగాలన్నారు. ప్రతి రంగాల్లో సామాజిక న్యాయం జరిగేలా రుణాలను అందజేయాలని ఆయన బ్యాంకర్లకు సూచించారు. 2026-27 ఆర్థిక సంవత్సరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు క్రాప్ లోన్ రుణాలు అందజేయాలనీ, పంట రుణాలకు సంబందించి రిన్యూవల్ చేయాలనీ బ్యాంకర్ల కు ఆదేశించారు. జిల్లాలోని మహిళా సంఘాలకు లక్ష్యం మేరకు రుణాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ యాదగిరి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీకాంత్, నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అఖిల్, బ్యాంకు మేనేజర్లు డిఆర్డిఓ శ్రీనివాస్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ రవి కుమార్, జిల్లా పశుసంవర్ధక అధికారి సదానందం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మహేశ్వర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో అవగాహన కల్పిస్తున్న ఫ్యూచర్ సిటీ సిపి తరుణ్ జోషి

## సురక్షిత హైవేలే లక్ష్యం

### ఫ్యూచర్ సిటీ సిపి తరుణ్ జోషి

**శంషాబాద్, ఆగస్టు20,ప్రభాతవార్త :** హైవేలపై ప్రయాణికుల భద్రతతో పాటు రహదారి పక్కన ఉన్న వ్యాపార సంస్థల్లో సురక్షిత వాతావరణం కల్పించేందుకు యాజమాన్యాలు పోలీసులకు సహకరించాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి సూచించారు. శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైవే సంస్థల యజమానులు, నిర్వాహకులు, ప్రతినిధులతో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫ్యూచర్ సిటీ పరిధిలో జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలు పెరుగుతున్న నేపథ్యంలో హైవే భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రెస్టారెంట్లు, ధాబాలు, పెట్రోల్ బంకులు, ఇతర హైవే వ్యాపార సంస్థలు ప్రయాణికుల భద్రతలో కీలక పాత్ర పోషించాలని సూచించారు.ప్రతి సంస్థలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, సున్నిత ప్రదేశాలను కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీలైన చోట హైవేలను కూడా కవర్ చేసేలా కెమెరాలు ఏర్పాటు చేసి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను పర్యవేక్షించాలని తెలిపారు. సీసీ కెమెరాలు నేరాల నివారణతో పాటు నేరాల దర్యాప్తులోనూ కీలక ఆధారాలుగా ఉపయోగపడతాయని వివరించారు. కొన్ని దాబాలు, రెస్టారెంట్ల వద్ద ఇటీవల చోటుచేసుకున్న దోపిడీలు, నేరపూరిత ఘటనల నేపథ్యంలో యాజమాన్యాలు మరింత అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. సంస్థల ప్రాంగణాల్లో ఎలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు తావివ్వ కూడదన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ముఖ్యంగా రాత్రి వేళల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని సూచించారు. సిబ్బందికి అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే విధంగా శిక్షణ ఇవ్వాలని చెప్పారు. అన్ని సంస్థల్లో డయల్ 112 నంబర్‌ను ప్రజలకు స్పష్టంగా కనిపించే ప్రదేశాల్లో ప్రదర్శించాలని ఆదేశించారు. రెస్టారెంట్లు, ధాబాల్లో ఆహార నాణ్యత, పరిశుభ్రత, హైజీన్ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అగ్నిమాపక భద్రతలో భాగంగా తగిన సంఖ్యలో ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు ఏర్పాటు చేసి, అవి పనిచేసే స్థితిలో ఉన్నాయో లేదో క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. వాటి వినియోగంపై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని చెప్పారు. హైవేలపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పార్కింగ్‌ను క్రమబద్ధీకరించాలని సీపీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్, చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్, ఐపీఎస్, షాద్‌నగర్ జోన్ డీసీపీ చ. శిరీష, డీసీపీ (ట్రాఫిక్) శివం ఉపాధ్యాయ్, సీనియర్ పోలీస్ అధికారులు, 500 మంది హైవే సంస్థల యజమానులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఇస్తానన్న ఉద్యోగాలు 2లక్షలు

## ఇచ్చింది 16వేలా!

### ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని సిపిఎం ఆందోళన బాట




మేడ్చల్ కలెక్టరేట్ వద్ద మహాధర్నాలో పాల్గొన్న జిల్లా సిపిఎం కార్యదర్శి పి.సత్యం తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20, ప్రభాతవార్త :** కొలువుల భర్తీలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, ఎన్నికల్లో ప్రకటించిన మెనిఫెస్టోలను అమలు చేయరాఅని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నట్లు, వెంటనే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా సిపిఎం కార్యదర్శి పి.సత్యం డిమాండ్ చేశారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద జిల్లా సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం నాయకులు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందస్తు సమాచారంతో కలెక్టరేట్ వద్ద భారీ ఎత్తున పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా సిపిఎం కార్యదర్శి పి.సత్యం మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఖాళీగ ఉన్న ప్రభుత్వ ఉద్యో గాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.. ఏడాదికి 2కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ సర్కార్ 2014లో అధికారంలోకి వచ్చిందని, 12ఏళ్ల గడుస్తున్నా ఆ హామీ నెరవేరటం లేదని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోనూ అదే తంతు కొనసాగుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లో సుమారు 10లక్షల ఉద్యోగాలు ఖాళీగ ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. ఐటీ రంగంలో ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ కూడ నెరవేరలేదని సత్యం విమర్శించారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో యువతకు అధికారంలోకి వచ్చాక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని యూత్ డిక్లరేషన్‌ను ప్రకటించిందని, స్వయంగా రాహుల్‌గాంధీనే అశోక్‌నగర్‌లో నిరుద్యోగులతో మాట్లాడారని కాంగ్రెస్ అధికారంలోకి వస్తే యువత భవిషత్ బతుకులు మారుతాయని భరోసా ఇచ్చారని, 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి కేవలం 16వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేసిందని ఆయన వివరించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లతో మొత్తం 62వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. 20వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగ ఉంటే 7,437పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. రాష్ట్రంలో 2లక్షల ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని, వెంటనే భర్తీ చేయాలని అన్నారు. మహాధర్నా తరువాత సిపిఐ నాయకుల బృందం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని ఛాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి, వినోద్, శ్రీనివాస్, రాజశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు లింగస్వామి, నరేశ్, వెంకన్న, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సజ్జనుడిలా.. సామాన్యుడిలా..!

### - బైకుపై వన్ వే ట్రాఫిక్‌లో ప్రయాణించిన నగర కొత్వాల్ సజ్జనార్- వన్‌వే విధానం పట్ల సంతృప్తి

**జూబ్లీహిల్స్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం కేబీఆర్ ఉద్యానవనం చుట్టూ ఎం తో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హెచ్-సిటీ ప్రాజెక్టు పనుల్లో భాగంగా కేబీఆర్ పార్కు పరిసరాల్లో కొత్తగా అమల్లోకి వచ్చిన వన్‌వే ట్రాఫిక్ విధానా న్ని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ గురువారం స్వయంగా బైకుపై ఒక సా మాన్య ప్రయాణికుడిలా వెనుక కూర్చొని పరిశీలిం చారు. ఎలాంటి హంగు, ఆర్భాటం లేకుండా సివి ల్ దుస్తుల్లో సాధారణ పౌరుడిలా బైక్‌పై ప్రయా ణిస్తూ క్షేత్రస్థాయి ట్రాఫిక్ పరిస్థితులను గమనిం చారు. ఉదయం 10 గంటల సమయంలో రోడ్డు నంబర్ 45 నుంచి జూబ్లీ చెక్‌పోస్ట్, వెంకటగిరి, కేబీఆర్ పార్కు ప్రధాన గేటు, ముగ్ధ జంక్షన్, బసవతారకం, అగ్రసేన్ చౌరస్తా, ఫిల్మ్‌నగర్ జంక్షన్ మీదుగా తిరిగి రోడ్డు నంబర్ 45 వరకు రెండు సార్లు బైక్‌పై ప్రయాణించి ట్రాఫిక్ సరళిని గమనించారు. అనంతరం మధ్యాహ్నం వేళలోనూ మరోసారి ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితు లను పరిశీలించారు.అగ్రసేన్ చౌరస్తా, ఫిల్మ్‌నగర్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్కు ప్రధాన గేటు తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహి స్తున్న పోలీసులతో సీపీ మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ సంద ర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ.. కేబీఆర్ పా ర్కు చుట్టూ వన్‌వే ట్రాఫిక్ విధానం సాఫీగా కొన సాగుతోందన్నారు. బుధవారం వన్‌వే విధానాన్ని అమల్లోకి తీసుకురాగా, తొలిరోజు లేన్ల మార్పిడిపై వాహనదారులు కొంత అయోమయానికి గుర య్యారన్నారు. అయితే గురువారం నాటికి రాకపో కలు పూర్తిగా సాఫీగా సాగుతున్నాయన్నారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రధాన కూడళ్ల వద్ద స్పష్టమైన సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు తగినంత మంది ట్రాఫిక్ సిబ్బందిని మోహరించినట్లు సీపీ వెల్లడిం చారు. జీహెచ్ఎంసీ, నిర్మాణ సంస్థతో సమన్వ యం చేసుకుంటూ హెచ్‌సిటీ ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసు కుంటున్నామన్నారు. పనులు పూర్తయ్యే వరకు నగరవాసులు పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటించాలని సీపీ సజ్జనర్ కోరారు.



బైకుపై వెళుతూ ట్రాఫిక్ తీరును పరిశీలిస్తున్న కమిషనర్ సజ్జనార్



ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

## ప్రాణం తీసిన ఆ డ్రైవర్.. మైనర్!



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

- ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా నిర్లక్ష్యం
- మాజీ ఎంపిపి కుమారుడు అయినందువల్లే పోలీసుల రక్షణ
- మృతుని కుటుంబ సభ్యులు ఆరోపణ
- నిందితునిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- తిమ్మాపూర్ వద్ద ధర్నా..పోలీసుల లాఠీచార్జ్

**కొత్తూరు, ఆగస్టు 20, ప్రభాతవార్త:** కొత్తూరు మండల పరిధిలో చేగురు రోడ్డు తిమ్మాపూర్ వద్ద గత శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బొగ్గుల సాయి గౌడ్ చికిత్స పొందుతూ మృతి చెందారు. సాయి గౌడ్ మృతిపై కుటుంబ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పేరును ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయకుండా పోలీసులు నిరక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు.

సాయి గౌడ్ మృతదేహంతో పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు, బంధువులు ప్రయత్నించగా.. పోలీసులు వారిని పోలీస్‌స్టేషన్‌కు చేరకుండా పెద్దమ్మ తండా రోడ్డు వద్దే అడ్డుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ప్రమాదానికి కారణమైన వ్యక్తి బాలానగర్‌కు చెందిన మాజీ ఎంపీపీ కుమారుడని, అతను మైనర్ అని మృతుని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అయినప్పటికీ ప్రమాద ఘటనకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో డ్రైవర్ పేరును నమోదు చేయకుండా పోలీసులు వ్యవహరించడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

**పోలీసులతో వాగ్వాదం**

పెద్దమ్మ తండా రోడ్డు వద్ద పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారినట్లు సమాచారం.

పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు లాఠీచార్జ్ చేశారు. సాయి గౌడ్ మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎఫ్ఐఆర్‌ను సక్రమంగా నమోదు చేసి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ ఘటనతో కొత్తూరు మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# దేశ ప్రగతికి రాజీవ్ కృషి కీలకం

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని, వివిధ ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు (ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, డిసిసి అధ్యక్షులు) రాజీవ్ గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజీవ్ గాంధీ దేశంలో కంప్యూటర్ పరిజ్ఞానాన్ని, టెలికాం రంగాన్ని విస్తరించి, ఆధునిక భారతదేశ నిర్మాణానికి బలమైన పునాది వేశారని నాయకులు కొనియాడారు. 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి రాజకీయాల్లో యువత భాగస్వామ్యాన్ని పెంచారని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల బలోపేతానికి, పంచాయతీ రాజ్ వ్యవస్థ సంస్కరణలకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. జయంతి సందర్భంగా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, కంపాస్ బాక్సులు పంపిణీ చేయడంతో పాటు ఆసుపత్రుల్లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

## జయంతి వేడుకల్లో వక్తల ఉద్ఘాటన: పలుచోట్ల సేవా కార్యక్రమాలు



నారపల్లిలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు



రాజీవ్‌గాంధికి నివాళులు అర్పిస్తున్న తాండూరు మునిసిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్‌రెడ్డి



పెద్దేముల్ మండలం ఇందూరు గ్రామంలో పాల్గొన్న డిసిసి అధ్యక్షులు ధారాసింగ్



యాచారంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీశైలం తదితరులు



మూడుచింతలపల్లిలో పాల్గొన్న మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ్ తదితరులు




పరిగిలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ కుడుముల రజిత తదితరులు




ఘట్‌కేసర్‌లో రాజీవ్‌గాంధీకి నివాళులు అర్పిస్తున్న డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ తదితరులు



మేడ్చల్‌లో రాజీవ్ చిత్రపటానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు



మొయినాబాద్‌లో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లిగిద్ద సత్యనారాయణ తదితరులు



అలియాబాద్‌లో నివాళులు అర్పించిన మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషకృష్ణారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేశ్ తదితరులు



దేవరయాంజాల్‌లో పాల్గొన్న మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ జైపాల్‌రెడ్డి



ఫరూక్ నగర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్



రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఏఎంసి చైర్మన్ ఆంజనేయులు, పిఎసిఎస్ చైర్మన్ భీంరెడ్డి తదితరులు



నందిగామలో పాల్గొన్న సర్పంచ్ కొమ్ము కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార స్వామి గౌడ్ తదితరులు



ఎదులాబాద్‌లో నివాళులు అర్పిస్తున్న డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు అమరేందర్ తదితరులు

**ఘట్కేసర్ రూరల్ ఆగస్టు 20 :** పోచారం డివిజన్ పరిధిలోని నారపల్లి, కాచవాని సింగారం, రాజీవ్ గృహకల్ప, ప్రతాప సింగారంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాసరెడ్డి, ఎర్ర రాజు, ఎర్ర మాధవి, గణేశ్ యాదవ్, కె. వినోద్ తదితరులు పాల్గొన్నారు.

**పెద్దేముల్ :** ఇందూరు గ్రామంలో మండల అధ్యక్షుడు పి.మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం, జైరాంతాండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వారికి పెన్నులు, పెన్సిళ్లు, కంపాక్స్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సిరెడ్డి, గోపాల్, లొంక నర్సిములు, నారాయణరెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్ :** మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నడికొప్పు నాగరాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్ గౌడ్, చీర్ల రమేష్ కురుమ, దేవరాజ్, మహేష్, సాయి కుమార్, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శామీర్‌పేట:** మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి. జైపాల్ రెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**మూడుచింతలపల్లి:** మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో చిత్రపటానికి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇర్రి రవీందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

**దేవరయాంజాల్:** శామీర్‌పేట డివిజన్ పరిధిలో రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి బి.జైపాల్ రెడ్డి పూలమాల వేసి అంజలి ఘటించారు. నాయకులు శంకర్ గౌడ్, లక్ష్మీనారాయణ, ధర్మారెడ్డి, కత్తి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

**యాచారం:** మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోటే శ్రీశైలం ఆధ్వర్యంలో యాచారం మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కిషన్ నాయక్, రాజు గౌడ్, సుగుణ సంపత్, నాయకులు రామకృష్ణ యాదవ్, హరికిషన్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

**పరిగి :** పరిగి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జి. రామకృష్ణ రెడ్డి నేతృత్వంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ కుడుముల రజిత వెంకటేష్, వైస్ చైర్మన్ కమల్, మండల అధ్యక్షులు వెంకట రాములు, శాంత కుమార్, పిఎసిఎస్ చైర్మన్ యాదవరెడ్డి తదితరులు హాజరయ్యారు.

**చౌడపూర్:** చౌడాపూర్ మండల కేంద్రం మరియు చాకల్ పల్లి గ్రామాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం. చంద్రశేఖర్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ అశోక్ కుమార్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు నవీన్, గోపాల్, రాము, సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్:** ఫరూక్ నగర్ మండల కేంద్రంలో పట్టణ అధ్యక్షుడు నలమోని శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను అందజేశారు. మున్సిపల్ చైర్మన్ ఆగ్గనూరు బసవేశ్వర్, మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కుల్కచర్ల:** మండల కేంద్రంలో పిఎసిఎస్ చైర్మన్ భీంరెడ్డి, ఏఎంసి చైర్మన్ ఆంజనేయులు, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్ నాయక్ రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో వెంకటయ్య గౌడ్, అంజిలయ్య గౌడ్, భరత్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**తాండూరు:** రాజీవ్ కాలనీలో పట్టణ అధ్యక్షుడు బాతుల నాగు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో తాండూరు మునిసిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్ రెడ్డి పాల్గొని, రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజాక్, ప్రభాకర్ గౌడ్, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

**కొడంగల్ రూరల్ :** కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ డివి.నరేశ్‌రాజ్‌తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు రాజీవ్‌కు నివాళి అర్పించారు.

**జవహర్‌నగర్ :** రాజీవ్ గాంధీ నగర్‌లో మాజీ మేయర్,జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షురాలు శాంతి కోటేష్ గౌడ్ రాజీవ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రాజీవ్ గాంధీ నగర్ కాలనివాసులు పాల్గొన్నారు.

**మొయినాబాద్:** మొయినాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లిగిద్ద సత్యనారాయణ, మున్సిపల్ అధ్యక్షులు విక్రంరెడ్డి ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ చౌరస్తా దగ్గర ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిపిసిసి అధికార ప్రతినిధి గౌరీ సతీష్ గారు, మండల కాంగ్రెస్ గౌరవ మాజీ అధ్యక్షులు తమ్మిలి మానెయ్య, కౌన్సిలర్ అశోక్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు కంజర్ల బాస్కర్, రామ్ రెడ్డి, జంగయ్య, కృష్ణారెడ్డి , సామ జగన్ రెడ్డి, అనంత రెడ్డి, మాణిక్యం, నిరంజన్ గౌడ్, శంకర్ గౌడ్, మహేందర్ రెడ్డి, రాఘవ రెడ్డి,గౌతమ్ రెడ్డి,సద్గుణ చారి, గణేష్ గౌడ్, జయరాం రెడ్డి,కేబుల్ రాజు,గన్నేపాక నర్సింగ్ రావు, సర్పంచ్ అజయ్ రెడ్డి, మీనాజుద్దీన్, బిక్షపతి ముదిరాజు, హనుమంతు యాదవ్, మహా ఆనందం గౌడ్, మల్లేష్ గౌడ్, బిక్షపతి, ఏ మల్లేష్ గౌడ్, సుధాకర్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, రాములు, శ్రీపాల్ రెడ్డి, శ్రీశైలం, వెంక రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు దయానంద గౌడ్, బాకారం చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**నందిగామ :** నందిగామ మండల కేంద్రంలో గాంధీ చౌక్ వద్ద రాజీవ్ చిత్రపటానికి సర్పంచ్ కొమ్ము కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార స్వామి గౌడ్, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి, సిటీతండా మాజీ సర్పంచ్ జటావత్ రాజునాయక్, నందిగామ సింగిల్ విండో చైర్మన్ కుందారం వెంకట్ రెడ్డి, వార్డు సభ్యులు అగ్గి ప్రసాద్, అగ్గి మమత సూరి, చించేటి లతా శివ గౌడ్ ,శివగళ్ల ప్రవీణ్, శివగళ్ల సురేష్, బొమ్మగల నర్సింలు, టైలర్ కృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ నర్సింలు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ విస్లావత్ గోపాల్, డైరెక్టర్ లు అగ్గి అంజయ్య గౌడ్, మెగావత్ రవి నాయక్, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కేశమోని రామచంద్రి, నాయకులు బి జంగయ్య గౌడ్, బి కృష్ణ యాదవ్, పిట్టల రాములు, నరేందర్ రెడ్డి, అభిరామ్,ఎర్రగారి రమేష్, పబ్బతి కరుణాకర్, రహమత్ అలీ, తడకల జంగయ్య తదితరులు నివాళులర్పించారు.

**షాబాద్ :** షాబాద్‌లో రాజీవ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంటారెడ్డి, సర్పంచ్ అశోక్, నాయకులు రమేష్, రామస్వామి, శ్రీను, శివకుమార్, గౌతం తదితరులు నివాళులర్పించారు.

**ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్ పట్టణంలో డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు మాజీప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం సామాజిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. డిసిసి కార్యదర్శి మామిండ్ల ముత్యాలుయాదవ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరక్టర్ చిల్కూరి మచ్చేంధర్‌రెడ్డి, మత్స్యశాఖ జిల్లా సొసైటీ సభ్యులు మెడబోయిన వెంకటేశ, ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కొంతం అంజిరెడ్డి, కీసరగుట్ట డైరక్టర్ సగ్గు అనిత, కొమురవెల్లి సభ్యులు మెరుగు నరేశ్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు కడపొల్ల మల్లేశ్, కుతాడి రవీందర్, మాజీ వార్డుసభ్యులు కొంతం రాంరెడ్డి, మీసాల సుధాకర్‌రావు, కొత్తకొండ వెంకటేశ్, కొరుబోతు నాగరాజు, సల్లూరి నర్సింగ్‌రావు, మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్క సుధాకర్‌రెడ్డి, మాజీ ప్రధానకార్యదర్శి బర్ల రాధాకృష్ణ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎం.ఎ.ఫారూఖ్, జిల్లా కార్యదర్శి ఎం.ఎ.రహమాన్, నాయకులు కందకట్ల మాధవరెడ్డి, మేకల సునీల్‌కుమార్, ఎం.అబ్దుల్‌ఖయ్యూమ్, మొల్గురం గణేశ్, బొక్క సత్తిరెడ్డి, రాజు, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఎదులాబాద్‌లో**

ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్‌లో నిర్వహించిన రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సామల అమరేందర్, కీసరగుట్ట ట్రస్ట్‌బోర్డు సభ్యులు అమరేందర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరక్టర్ కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ డైరక్టర్లు గాయరు విశ్వనాథం, జవాజి సత్తయ్య, మాజీ వార్డుసభ్యులు మెట్టు రమేశ్, కంచర్ల వెంకట్‌రెడ్డి, డొంకెన శంకర్‌గౌడ్, నాయకులు కవాడి మాధవరెడ్డి, మెట్టు నర్సింహ్మా, బింగి రాజేందర్‌గౌడ్, ముద్దం మల్లేశ్‌యాదవ్, శ్రావణ్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు.

# సిద్దాపూర్ డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలి

**షాద్‌నగర్,/కొత్తూరు ఆగస్టు 20, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూర్ మండలం సిద్దాపూర్ గ్రామంలో సుమారు 86 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ (డంపింగ్ యార్డ్) ప్రతిపాదనను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆదేశాల మేరకు స్థానిక నాయకులు కొత్తూర్ తహశీల్దార్ మరియు షాద్‌నగర్ ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో సిద్దాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం, భూగర్భ జలాలు, పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని స్థానిక నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు విఘాతం కలిగించే ఈ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు పెంటనోళ్ళ యాదగిరి, మాజీ మున్సిపల్ చైర్మన్ లావణ్య దేవేందర్ యాదవ్, సర్పంచ్ లలిత గోపాల్ నాయక్, మాజీ సర్పంచులు మిట్టు నాయక్, రమేష్, మాజీ ఎంపీటీసీ వడ్డె బాలయ్య, మాజీ కౌన్సిలర్ ప్రసన్నలత యాదయ్య, నాయకులు రవి కుమార్, బుచ్చిబాబు, రాములు నాయక్, లక్ష్మణ్ నాయక్, కోట్య నాయక్, జంగయ్య, గోపి నాయక్, బిచ్య నాయక్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# విద్యుదాఘాతంతో రెండు బర్రెలు మృతి

**షాద్‌నగర్, ఆగస్టు 20, ప్రభాతవార్త :** విద్యుత్‌దాఘాతానికి గురై రెండు బర్రెలు మృతిచెందిన ఘటన ఫరూక్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు గోదా రమేష్ యాదవ్ పొలం వద్ద బర్రెలను మేపుతుండగా అకస్మాత్తుగా విద్యుత్ వైర్ తెగి బర్రెలపై పడటంతో విద్యుత్ షాక్‌కు గురై రెండు బర్రెలు అక్కడికక్కడే మృతిచెందాయి. మృతి చెందిన రెండు బర్రెల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా. బర్రెలే తనకు జీవనాధారమని, పాలను విక్రయించి కుటుంబాన్ని పోషిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తనకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు. బాధిత రైతును పరామర్శించిన నాయకులు ఈ ఘటనపై సమాచారం అందుకున్న లింగారెడ్డిగూడ సర్పంచ్ ప్రవీణ్ కుమార్ వెంటనే పీఏసీఎస్ చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి, విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం బాధిత రైతు రమేష్ యాదవ్‌ను పరామర్శించి ఓదార్చారు. రైతుకు ప్రభుత్వ పరంగా సహాయం అందేలా కృషి చేస్తామని చల్లా శ్రీకాంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ నరేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు సురేష్ గౌడ్, ఎం. మల్లేష్, శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొని బాధిత రైతు రమేష్ యాదవ్‌ను పరామర్శించారు.




ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులు

# పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేయొద్దు

**షాద్‌నగర్, ఆగస్టు 20, ప్రభాతవార్త :** డిప్లొమా, పాలిటెక్నిక్ విద్యను సివిల్ యూనివర్సిటీల్లో విలీనం చేసే ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే పునరాలోచించాలని ఎస్‌ఎఫ్‌ఐ షాద్‌నగర్ డివిజన్ కార్యదర్శి వడ్ల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని, జీవో నంబర్ 97ను రద్దు చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు షాద్‌నగర్ ఎంఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేకమైన విద్యా విధానం, సాంకేతిక శిక్షణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన కోర్సులు ఉన్నాయని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలను యూనివర్సిటీలో విలీనం చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ షాద్‌నగర్ పట్టణ ఉపాధ్యక్షులు అదిల్, చరణ్, రాంచరణ్, నాయకులు శివ, భాను, వంశీ, విష్ణువర్ధన్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

**విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తారా?**

పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 97ను వెంటనే రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యపై ఆధారపడుతున్న వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసేలా ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఏటా అన్ని వర్గాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యను అభ్యసిస్తున్నారని, డిప్లమా పూర్తి చేసిన వారికి సాంకేతిక రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. అలాంటి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, దానికి విరుద్ధంగా జీవో 97 తీసుకురావడం విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేయడమేనని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, పేద మరియు మధ్యతరగతి కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా కొనసాగించాలని అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే, విద్యార్థుల పక్షాన బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అవసరమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అంజయ్య యాదవ్ హెచ్చరించారు.

## శ్మశాన వాటికలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**షాద్‌నగర్, ఆగస్టు 20, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ముదిరాజ్ మరియు రజకుల స్మశాన వాటికలో నెలకొన్న నీటి కొరత సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది.స్మశాన వాటికలో నీటి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన షాద్ నగర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ అందె మోహన్ గారు, ప్రజల సౌకర్యార్థం బోర్ ఏర్పాటు చేసేందుకు ముందడుగు వేశారు. ఈ మేరకు 2వ వార్డు కౌన్సిలర్ బచ్చలి నరేష్ గారితో కలిసి స్మశాన వాటికను సందర్శించి, బోర్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాన్ని పరిశీలించి బోర్ పాయింట్‌ను చూపించడం జరిగింది. ఎన్నికల సమయంలో 14వ వార్డు ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అతి త్వరలో స్మశాన వాటికలో బోర్ ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించేందుకు వైస్ చైర్మన్ అందె మోహన్ గారు కృషి చేస్తున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చే దిశగా ముందుకు సాగుతున్న వైస్ చైర్మన్ అందె మోహన్ గారి చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ప్రజా ప్రతినిధులు

# పేరుగొప్ప ఊరుదిబ్బ

## - మిషన్ భగీరథ నీటిసరఫరాపై విమర్శలు - నీరందక బోర్లేదిక్కవుతున్నాయన్న ప్రజా ప్రతినిధులు- ఎమ్మెల్యే సూచనలతో సర్పంచులతో అధికారుల ప్రత్యేక ముఖాముఖి

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 20,(ప్రభాతవార్త):** మిషన్ భగీరథ నీటి సరఫర పేరుగొప్ప ఊరుదిబ్బా అన్న చందంగ మారిందని జిల్లెడు చౌదరిగూడ మండల ప్రజా ప్రతినిధులు విమర్శలు చేశారు. గురువారం జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మిషన్ భగీరథ పథకంలోని ఇంట్రా, గ్రిడ్ అధికారులతో సర్పంచ్ లు తమ ఆవేదనను వెళ్లబోసుకున్నారు. ఇటీవల జరిగిన మండల స్థాయి ప్రత్యేక అధికారుల సమావేశంలో షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి భగీరథ నీటి విషయంలో వచ్చిన పలు సమస్యలపై ఆయన స్పందిస్తూ అన్ని గ్రామాల సర్పంచులు మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. దీంతో మండల అభివృద్ధి అధికారిని పుష్పలత ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు నీటి ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ భగీరథ నీళ్లు గ్రామాలకు సక్రమంగా చేరడం లేదంటూ ఆయా గ్రామాల సర్పంచులు తమ గోడును వెల్లబోసుకున్నారు. జాకారం సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. నీటి సరఫరా విషయంలో మిషన్ భగీరథ ఏంట్రా గ్రిడ్ అధికారుల సమన్వయ లోపం, మిషన్ భగీరథ సూపర్వైజర్లు, లైన్ మెన్ లు నిరక్ష్యం కారణంగా గ్రామాల్లో నీటి ఇబ్బందులు వస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో అవసరం ఉన్నంత మేర నీటిని సరఫరా చేయడం లేదని ట్యాంకుల్లో సగం నీరు నిండకముందే సంతకాలు చేసుకొని వెళ్ళిపోతున్నారని ఆరోపించారు. ఎలుక గూడెం గ్రామం పరిధిలో బోయగూడకు అసలు ఇప్పటివరకు నీరే అందడం లేదని, చిన్న మోటార్ల తోటి ట్యాంకిలో ఎక్కిస్తే నెలలో ఆరుసార్లు బోరు మోటర్ కాలిపోయిందని సర్పంచి బందయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఈ విషయం చెప్పిన పట్టించుకోవడంలేదని అన్నారు. చింతకుంట తండాలో పైపులైన్లు లీకేజీలు అవుతున్నాయని, ట్యాంక్‌లో నీటి నిల్వ ఉండడం లేదని అన్నారు. ఎదిర గ్రామంలో వాటర్ మెన్లు సర్పంచులకు సమాచారం ఇవ్వకుండా పోతున్నారని దీంతో గ్రామంలో నీరు రాకపోవడంతో ప్రజలు నిలదీస్తున్నారని అన్నారు. పద్మారంలో నిర్దేశించిన మేర నీటిని ట్యాంకులో నింపడం లేదని దీంతో ఇబ్బందులు వస్తున్నాయని సర్పంచ్ మోనాచారి అన్నారు. ముష్టిపల్లిలో ట్యాంక్ లోకి నీరు ఎక్కడం లేదని సర్పంచి జంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మతాండలో పంచాయతీ పరిధిలోని సుక్యతాండలో ఇప్పటివరకు ట్యాంకులోను చుక్క నీరు నింపలేదని అన్నారు. వారంలో రెండుసార్లు వస్తే మహా గగనం అని బోర్లు వేసిన నీరు పడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నీటి సరఫరా లో చర్యలు తీసుకోవాలని అన్నారు. చౌదరి గూడెంలో సర్పంచి శ్వేత నీటి సమస్యలను గుర్తు చేశారు. శిథిలావస్థలో ఉన్న ట్యాంకును తొలగించాలని కోరారు. గుర్రంపల్లి సర్పంచ్ జంగయ్య అధికారుల సమన్వయ లోపంతో నీటి సరఫరా లో గందరగోళమునట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పుష్పలత మాట్లాడుతూ గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌ల నుంచి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని వాటర్ మెన్ ల నిరక్ష్యం పై చర్యలు తీసుకోవాలని పెర్కొన్నారు.ఎప్పుడు ఒకే గ్రామంలో పని చేసే విధంగా కాకుండా పక్క గ్రామాలకు బాధ్యత ఇవ్వాలని సూచించారు. మరోసారి సమావేశం జరిగే వరకు సర్పంచులు సూచించిన అన్ని సమస్యలను పరిష్కరించాలని ఆమె తెలిపారు. ఈ విషయాలపై మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఎవైన సమస్యలు ఉంటే ఇంట్రా డి ఈ అబ్దుల్ బారి(9100122073), గ్రిడ్ డిఈ మమత(9100122055), ఇంట్రా ఏ ఈ యుకేందర్ రెడ్డి(6309954463), గ్రిడ్ ఏఈ ఖాజా హుస్సేన్(7416497971) లకు నీటి సమస్యలపై సంప్రదించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిఓ హన్మంత్‌రెడ్డి,ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



యువకుడిని అభినందిస్తున్న డిఎస్పి శ్రీనివాస్

### పోగొట్టుకున్న నగలను
## బాధితురాలికి అప్పగింత

**పరిగి, ఆగస్టు 20, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా, పరిగి నియోజకవర్గం, చౌడపూర్ మండల పరిధిలోని పందివనంపల్లి గ్రామానికి చెందిన సుజాత అనే మహిళ బుధవారం చౌడపూర్ సంతకు కూరగాయలకోసంవచ్చింది. అయితే ఆమెదగ్గర ఉన్న రెండున్నర తులాల బంగారు నాను, అరతులం బంగారు చెవికమ్మలను పోగొట్టుకున్నది. గురువారం ఉదయం సంత రోడ్డులో చౌడపూర్ గ్రామానికి చెందిన బోయిని బాలరాజుకు దొరకడంతో, పరిగి డిఎస్పి శ్రీనివాస్ సమక్షంలో అట్టి బంగారు వస్తువులను బాధితు రాలికి అందజేశారు.డిఎస్పి శ్రీనివాస్ ,యువకుడు బాలరాజు నిజాయితీని మెచ్చుకుని, అభినందించారు. నిజాయితీగా ఉంటే సమాజంలో గౌరవం పెరుగుతుందని, యువత నిస్వార్థమైన సేవలు సమాజానికి ఉపయోగపడ తాయని డిఎస్పి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ కొండల్ రెడ్డి, వెంకటేష్,శంకరయ్య,భాదిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# లక్ష్మీదేవిప్రాజెక్టుసర్వేను అడ్డుకున్న రైతులు

### పరిహార ధర నిర్ణయించాలని రైతుల డిమాండ్

**పరిగి, ఆగస్టు 20, ప్రభాతవార్త:** లక్ష్మీదేవిప్రాజెక్టు నిర్మాణానికి భూసేకరణలో సర్వే చేపట్టడానికి అధికారులు సిద్ధమవ్వడంతో, పరిగి మండలం సయ్యధ్ పల్లి గ్రామంలో గురువారం అధికారులకు,రైతులకుమధ్య వాగ్వాదం చోటు చేసుకుంటుంది.పరిగి,వికారాబాదా,చేవెళ్ల , షాద్‌నగర్ నియోజక వర్గాల్లోని దాదాపు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందింఛేందుకు లక్ష్మీదేవి పల్లి,కొందుర్గ ప్రాజెక్టుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి , భూసేకరణ ప్రక్రియ ప్రారంభించింది. గురువారం, సయ్యద్ పల్లి శివార్లలో అధికారులు భూసర్వే కి రావడంతో గ్రామస్థులు,రైతులు అధికారులను అడ్డుకున్నారు. సుమారు 900ఎకరాలు సయ్యద్ పల్లి రైతులకు చెందిన భూములు కోల్పోతున్నామని , ముందు ఒక ఎకరాకు ప్రభు త్వం ఎంత పరిహారం అందిస్తుందో తెలపాలని, పరిహార ధర నిర్ణయించాకే భూసర్వే చేపట్టాలని ఆందోళనకు దిగారు. గ్రామ సభ ఏర్పాటు చేసి , ఎవరెవరి భూములు ప్రాజెక్టుకు సేకరిస్తున్నారో,ఎంత పరిహారం వస్తుందోనని రైతులకు స్పష్టంగా తెలియజేయాలని డిమాండ్ చేసారు.. అంతేకాక 900 ఎకరాలు ప్రాజెక్టు నిర్మాణానికి ఇస్తున్న సయ్యద్పల్లి రైతులే నష్టపోతామని, ప్రాజెక్టుకు సయ్యద్‌పల్లి పేరే పెట్టాలని రైతులు అధికారులకు సూచించారు.పరిగి మండల తహసీల్దార్ వెంకటేశ్వరి,సిఐ కొండల్ రెడ్డి, సయ్యద్‌పల్లికి చేరుకుని , రైతుల డిమాండ్లను పైఅధికారుల దృష్టికి



అధికారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

# భూసేకరణలో రైతుల అభిప్రాయాలకే ప్రాధాన్యం : ఆర్డీఓ అనిత

**దౌల్తాబాద్,అగస్టు 20,ప్రభాతవార్త:** రైతుల ప్రయోజనాలే ప్రభుత్వ ధేయమని,భూసేకరణ ప్రక్రియలో వారి అభిప్రాయాలు,అభ్యంతరాలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తామని తాండూర్ ఆర్డీఓ అనిత స్పష్టం చేశారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా దౌల్తాబాద్ మండలంలోని ఈర్లపల్లి, చెల్లాపూర్, దౌల్తాబాద్ గ్రామాలలో ఈర్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం చేపట్టనున్న భూసేకరణపై గురువారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు.ఈ సమావేశాలకు తాండూర్ ఆర్డీఓ అనిత,దౌల్తాబాద్ తహశీల్దార్ వెంకటస్వామి హజరై రైతులతో చర్చలు జరిపారు.రిజర్వాయర్ నిర్మాణం నిమిత్తం ఈర్లపల్లి చెరువు కింద 37.22 ఎకరాలు,కుడి కాలు కింద 20.12 ఎకరాలు,అలాగే ఎడమ కాలువ కింద 37.33 ఎకరాల భూమి అవసరమని ప్రతిపాదించారు.చెల్లాపూర్‌లో నిర్వహించిన గ్రామసభలో చెల్లాపూర్ గ్రామ పరిధిలో కుడి కాలువ నిర్మాణం కోసం 37.33 ఎకరాల భూమిని సేకరించనున్నారు.దౌల్తాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామ సభలో ఈర్లపల్లి ఎడమకాలువ కోసం 15.12 ఎకరాల భూమిని సేకరించనున్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ రిజర్వాయర్ కింద భూములు కోల్పోయే రైతులకు పరిహారం కింద ఎకరాకు రూ.20లక్షలు ఇవ్వడం జరుగుతుందని,మొత్తం భూమి కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.20లక్షలతోపాటు అదనంగా రూ.5లక్షల60 వేలు ఇవ్వడం జరుగుతుందని అధికారులు రైతులకు తెలిపారు. అనంతరం ఈర్లపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో రైతులు మాట్లాడుతూ ఈర్లపల్లి అమ్మ చెరువు పేరుపై నిర్మించ తలపెట్టిన రిజర్వాయర్ పేరును మార్చవద్దని రైతులు గ్రామస్థులు అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో డీటీ వెంకటాచారి,ఆయా గ్రామ సర్పంచ్‌లు పద్మవెంకట్ రాములు,రోజరమేష్,శ్రీనివాస్‌రెడ్డి,రెవెన్యూ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక రైతులు పాల్గొన్నారు.



ఈర్లపల్లిలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ అనిత

# ఆ స్థలంలో గ్రామపంచాయతీ భవనం నిర్మించవద్దు!

### అభ్యంతరం తెలుపుతున్న గ్రామస్తులు!

**కొందుర్గు, ఆగస్టు 20, ప్రభాతవార్త :** నూతనంగా నిర్మించ తలపెట్టిన గ్రామపంచాయతీ భవనం చెరువు కట్ట ముందర నిర్మించవద్దని మండల పరిధిలోని ఆగిరాల గ్రామస్తులు అభ్యంతరం తెలుపుతున్నారు. ఆగిరాల గ్రామంలో పాత గ్రామపంచాయతీ భవనము శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వము నూతన భవన నిర్మాణం కోసం నిధులను మంజూరు చేసింది. బుధవారం నాడు మండల పంచాయతీరాజ్ ఇంజనీర్ భవన నిర్మాణం కోసం కొలతలు ఇచ్చారు. ఆ స్థలం బఫర్ జోన్‌కు సంబంధించినది, అక్కడినుండి చెరువు తూము కాలువతోపాటు మిషన్ భగీరథ లైన్, ప్రభుత్వం ఆన్లైన్ కేబుల్ లైన్లు ఉన్నాయని గ్రామస్తులు తెలిపారు. అంతే కాకుండా ఆ స్థలంలోనే గ్రామంలో ఇలాంటి బహిరంగ సభలు, సమావేశాలు, ఆరోగ్య శిబిరాలు, ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తుంటారని గ్రామస్తులు తెలిపారు. అంతేకాకుండా ఆ స్థలం వెనుక చెరువుగట్టుపై ట్యాంక్ బండ్‌పై మాదిరిగా ఎందరో మహానీయుల విగ్రహాలను ప్రతిష్టించామన్నారు. ఎన్నో కార్యక్రమాలకు అనుకూలమైన ఆ స్థలంలో గ్రామ పంచాయతీ భవనం నిర్మించటం ఎంతవరకు సమంజసం అని గ్రామ స్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం, పశు వైద్య ఉప కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని తొలగించి ఆ స్థలంలో గ్రామపంచాయతీ భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధికారులు స్పందించి ఈ నూతన భవన నిర్మాణము పనులు ఆపకపోతే జిల్లా ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని పలువురు గ్రామస్తులు తెలిపారు.



నాగారం డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎంఎంసి కమీషనర్‌కి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

## నాగారం డివిజన్‌ని అభివృద్ధి చేయాలి

### ఎంఎంసి కమీషనర్‌కి వినతి

**కీసర,ఆగస్టు20,ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్‌ని అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయాలని గురువారం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆద్వర్యంలో ఎంఎంసి కమీషనర్ వినయ్ క్రిష్ణారెడ్డికి నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎల్లసాని భూమయ్య యాదవ్ వినతి పత్రాన్ని అందజేశారు.అడిగిన వెంటనే నాగారం అభివృద్ధికి 25 కోట్లు నిధులు మంజూరు చేయించేందుకు చర్చించినందుకు కమీషనర్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

నాగారం డివిజన్‌లో రోడ్లు,డ్రైనేజీ,మౌళిక వసతులు.ఇతర పనులను మరింత వేగవంతంగా చేపట్టేందుకు 25 కోట్లు నిధులు ఎంతో ఉపయోగపడుతాయన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి,మాజీ వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్,మాజీ కౌన్సిలర్ వెంకట్‌రెడ్డి,నాయకులు జీవన్‌రెడ్డి,నల్లోల్ల కుమార్,అన్నంరాజు సురేష్,గండి ప్రకాష్ గౌడ్,దొడ్డి బాలనర్సింహ్మా,పంగ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# పంటల పరిశీలన

**షాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త :** పత్తి, వరి రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని ఏవో దండెం విజయచంద్ర అన్నారు. గురువారం మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామంలో వరి రైతులకు వేపనూనె, నానో యూరియా, డిఏపీ, జింక్ వంటివి రైతులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ... సమతుల్య ఎరువుల వినియోగం, యాజమాన్యం, తెలగుళ్ల నివారణపై రైతులకు వివరించారు. ఎల్నినో ప్రభావంతో తేమ కొరత నేపథ్యంలో తేమను సంరక్షించుకోవాలని, ఆర్థిక నష్టపరిమితిని దాటిన తర్వాతే పురుగులమందులు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మోనిక, రైతులు రాజు, రఘునాథ్ రెడ్డి, వెంకయ్య, రాఘవేందర్, ప్రకాష్



రైతు రాజుకు ఉచితంగా అందజేస్తున్న ఏవో దండెం విజయచంద్ర తదితరులు

## బావిలో పడి వృద్దుడు మృతి

**యాలాల ఆగస్టు 20,ప్రభాతవార్త :** మతిస్థిమితం లేని ఓ వృద్దుడు బావిలో పడి మృతి చెందాడు.ఈ సంఘటన యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని బండమీదిపల్లి గ్రామ శివారులో గురువారం చోటు చేసుకుంది.యాలాల ఎస్ఐ. విఠల్‌రెడ్డి కథనం ప్రకారం కోడంగల్ మండలం హుస్నాబాద్ గ్రామానికి చెందిన నీరటి నర్సప్ప ఈ నెల 16 వ తేదీన ఇంటినుంచి వెళ్లి పోయాడు.

20వ తేదీన బండమీది పల్లి గ్రామ శివారులోని ఓ బావిలో పడి చనిపోయాడు. మృతుని కొడుకు సమాచారం మేరకు సంఘటనా స్థలికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆస్పరతికి తరలించినట్లు తెలిపారు.తన తండ్రికి మతి స్థిమితం లేని కారణంగా మృతి చెందాడని వారసుడు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ఘట్‌కేసర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఫకీర్‌టెక్యా తండాలో గురువారం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాలు మాలోత్ శాంతి ఆహ్వానం మేరకు అతిథిగా హాజరైన ఆయన నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సామల అమరేందర్, మాజీ సర్పంచ్ వేముల మమతగౌడ్, మాజీ ఉప సర్పంచ్ అకిటి సుధాకర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ కొమిరెడ్డి ఉదయ్ కుమార్ రెడ్డి, మాజీ డైరక్టర్ గాయరు విశ్వనాథం, కొముంవెల్లి దేవస్థానం ధర్మకర్త మెరుగు నరేష్‌గౌడ్, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ కార్యదర్శి కవాడి మాధవ్ రెడ్డి, అంకుశపూర్ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు గంగి శంకర్, మాజీ వార్డు సభ్యులు వద్యా జయందర్ నాయక్, మెట్టు రమేశ్, నానావత్ సురేష్‌నాయక్, నాయకులు బింగి రాజేందర్‌గౌడ్, డొంకెన శంకర్‌గౌడ్, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బత్తిని ప్రవీణ్ గౌడ్, పూస రమేష్, వద్యా సురేష్‌నాయక్, గడ్డం శ్రీనివాస్, మాలోత్ చిట్టిబాబునాయక్, మాలోత్ సురేష్ నాయక్, ఖాట్రోత్ శ్రీకాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# స్థలాల ఆక్రమణకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

### -అక్రమ పట్టాదారు పాసుపుస్తకాలు రద్దు చేయాలి
### -గోడలు ధ్వంసం చేసిన పరిహారం ఇవ్వాలి

**ఘట్‌కేసర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** తమ ప్లాట్ల హద్దురాళ్లు, ప్రహరీ గోడలను కూల్చివేసిన వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు ప్లాట్ల యాజమానులు డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ సర్కిల్ కొండాపూర్‌లోని శ్రీనిధి ఇంపీరియల్ పార్కులో రాత్రిపూట దాసరి సంజీవరెడ్డి, బాల్‌రెడ్డిలు జేసీబీతో వచ్చి అక్రమంగా తమ స్థలాల గోడలను కూల్చివేసి, హద్దు రాళ్లను చెరిపేసి ప్లాట్లను దున్ని కబ్జాకు పాల్పడుతున్నారని గురువారం బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. కొండాపూర్ సర్వేనంబర్లు 63, 67లోని శ్రీనిధి వెంచర్‌లో గతంలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులురెడ్డి 200 ప్లాట్లతో వెంచర్ చేయగా పేద, మధ్యతరగతి ప్రజలు స్థలాలు కొనుగోలు చేశారని తెలిపారు. దాసరి సంజీవరెడ్డి, బాల్‌రెడ్డిలు 2000 సంవత్సరంలో తమ భూమి విక్రయించారని, ఇంకా 8 ఎకరాలు తమ భూమి ఉందని 2019 నుంచి వెంచర్‌లో ప్లాట్లు కల్గిన వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో ప్లాట్ల కడీలు, చెట్లు కూల్చివేయగా వారిపై కేసులు నమోదు అయ్యాయని ఈభూమి విషయమై కోర్టు కేసు ఉండగా తిరిగి రాత్రిపూట వచ్చి ప్లాట్ల గోడలను కూల్చివేశారని ఒక్కో ప్లాట్లుకు లక్ష రుపాయలు నష్టం చేశారని వాపోయారు. ఈకార్యక్రమంలో సుంకరి వెంకటేష్, రామిడి రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఇమ్మడి యాదిరెడ్డి, రామిడి రాంరెడ్డి, అర్జున్‌రావు, మహేందర్, శ్రీకాంత్‌రెడ్డి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ శనేశ్వర స్వామి దేవాలయ పాలకవర్గం నియామకానికి
# దరఖాస్తులు చేసుకోండి

**మోమిన్‌పేట, ఆగస్టు 20,ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎన్కతల గ్రామంలో కొలువైన శ్రీశ్రీ శంకర్ భారత్ మహారాజ్ ఆశ్రమంలో గల శ్రీశ్రీ శనైశ్వర స్వామి దేవస్థానానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన ధర్మకర్తల పాలకమండలి నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్య నిర్వహణాధికారి వి. నరేందర్ పేర్కొన్నారు, గురువారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, దేవాలయ ధర్మకర్త ల మండలి నియామకానికి ఉత్తర్వులు విడుదల చేసిందని, ఆసక్తి గలవారు, దేవాదాయ ధర్మా దాయ శాఖ కమిషనర్ హైదరాబాద్, రంగారెడ్డి, వారిని సంప్రదించి, 20 రోజులు ముందు దరఖాస్తు చేసుకోవాలని, ఆయన సూచించారు, ఆసక్తి గలవారు దేవాదాయ ధర్మాదాయ కమిషనర్ రంగారెడ్డి జిల్లా వారికి నేడు మొదలుకొని 20, రోజుల లోపు దరఖాస్తులు చేసుకోవాలని దేవాదాయ ధర్మాదాయ కార్యనిర్వహణ అధికారి వి. నరేందర్ తెలిపారు.

## కొడంగల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 56 పోస్టులు

### కాంట్రాక్ట్ ఫ్యాకల్టీ,ట్యూటర్ల నియమానికి ఇంటర్వ్యూలు

**కొడంగల్,అగస్టు 20,ప్రభాతవార్త:** కొడంగల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాల, అనుబంధ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఫ్యాకల్టీ,ట్యూటర్ల పోస్టుల భర్తీకి వాక్ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. కాంట్రాక్ట్,హనరేరియం ప్రాతిపదికన మొత్తం 56 పోస్టులను భర్తీ చేయనున్నారు.ఇందులో ప్రొఫెసర్ పోస్టులు 3,అసోసియోట్ ప్రొఫెసర్ పోస్టులు 15,అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 24,ట్యూటర్ పోస్టులు 14 ఉన్నాయి. అనాటమీ ,ఫిజియాలజీ,బయోకెమిస్ట్రీ,పాథాలజీ,మైక్రోబయాలజీ,జనరల్ మెడిసిన్,పీడియాట్రిక్స్,జనరల్ సర్జరీ,ఆర్థోపెడిక్స్, అప్తాల్మాలజీ,ఒబిజి,అనస్థీషియా,రేడియో దయాగ్నోసిస్ తదితర వాభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాం.ఈనెల 29న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.అభ్యర్దులు విద్యార్హతలు, అనుభవ ధృవపత్రాలు,వైద్య మండలి రిజిస్ట్రేషన్, గుర్తింపు కార్డుల ఒరిజినల్ పత్రాలతోపాటు జిరాక్స్ ప్రతులు తీసుకు రావాలని అధికారులు సూచించారు.ఈ నియమాకాలు 31.03.2027 వరకు లేదా రెగ్యూలర్ పోస్టులు భర్తీ అయ్యే వరకు మాత్రమే అమల్లో ఉంటాయని తెలిపారు.ఆసుపత్రిలో వైద్య విద్యా,వైద్య సేవలను మరింత సమర్దవంతంగా నిర్వహించేందుకు అర్హులైన అభ్యర్దుల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.ఈ నియామకాలు ప్రభుత్వ వైద్య కళాశాల,ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి కొడంగల్, తాండూర్,వికారాబాద్ జిల్లా పరిధిలో వైద్య విద్యా సంచాలకులు,తెలంగానా,హైద్రాబాద్ వారి నియంత్రణలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## రూపా రెడ్డి దారుణ హత్యకు నిరసనగా మేడ్చల్‌లో పాఠశాలల బంద్

**మేడ్చల్, ఆగస్టు 20, ప్రభాతవార్త :** నల్గొండలోని నాగార్జున హైస్కూల్ ప్రిన్సిపాల్ రూపా రెడ్డి దారుణ హత్యను తీవ్రంగా నిరసిస్తూ, నేడు మేడ్చల్‌లో విద్యాసంస్థల బంద్ పాటించి నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం బాధ్యులు తెలిపారు.ప్రిన్సిపాల్ రూపా రెడ్డికి సంతాప సూచకంగా నేడు మేడ్చల్ పరిధిలోని ప్రైవేట్ పాఠశాలలన్నీ మూసివేయబడతాయని, నిరసనకు మద్దతుగా కరెస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, పాఠశాలల యాజమాన్యాలు నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత ర్యాలీ చేపట్టి నివాళులు అర్పిస్తామని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ కమిటీల ఎన్నిక

**కొడంగల్,అగస్టు 20,ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అద్వర్యంలో గ్రామస్ధాయిలో పార్టీ బలోపేతంలో భాగంగా నూతన గ్రామ కమిటీలను ఎన్నున్నారు.కాంగ్రేస్ మండల పార్టీ అద్యక్షులు సంజీవ్‌రెడ్డి అద్వర్యంలో గురువారం మండలంలోని ఇందనూర్,రుద్రారం,కస్తూర్‌పల్లి గ్రామ నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఇందనూర్ గ్రామ కాంగ్రెస్ కమిటీ అద్యక్షులు ఎండి.మౌలానాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అలాగే రుద్రారం గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా ఆర్.బాలక్రిష్ణ,కస్తూర్‌పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పోలీస్ వెంకట్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మండల పార్టీ అద్యక్షులు సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రేస్ పార్టీని గ్రామస్ధాయి నుండి బలోపేతం చేసేందుకు నాయకులు,కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ మండల పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ ఆనంద్‌రెడ్డి,జల్లా జనరల్ సెక్రటరీ బాల్‌రెడ్డి,రుద్రారం సర్పంచ్ ఎల్లప్ప,కస్తూర్‌పల్లి సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్,సీనియర్ నాయకులు గోడల రాంరెడ్డి,ఉడిమేశ్వర్ సర్పంచ్ శ్రీనివాస్,అప్పాయిపల్లి బాల్‌రాజ్‌లతో పాటు ఆయా గ్రామాల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు :**

దివంగత మాజీ ప్రదాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను గురువారం కాంగ్రేస్ పార్టీ అద్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కాంగ్రేస్ మండల పార్టీ అద్యక్షులు సంజీవ్‌రెడ్డి అద్వర్యంలో కొడంగల్ పట్టణంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివంగత మాజీ ప్రదాని రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివని అన్నారు.

## రేపు గురురవిదాస్ జయంతిలో పాల్గొనాలి

**ఘట్‌కేసర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** శనివారం జరిగే సంత్ శిరోమణి శ్రీగురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి ఉత్సవాలలో అధిక సంఖ్యలో పాల్గొనాలని ఘట్‌కసర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో గురువారం బిజెపి కార్యాలయం ఆవరణలో గురురవిదాస్ మహారాజ్ జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 22న నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఉదయం 10 గంటలకు కాలష్ వందన్ అభియాన్ కార్యక్రమంలో బాగంగా సంత్ శిరోమణి శ్రీగురురవిదాస్ మహారాజ్ 650వ జయంతి జరుగుతుందని ప్రతిఒక్కరూ హాజరు కావాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలలో బిజెవైఎం అధ్యక్షులు సుర్వి అనిల్‌గౌడ్, భరత్‌యాదవ్, కొన్నె మాధవి, దాసరి బాలనర్సింహ్మా, కంభం దయాకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న బిజెపి నాయకులు

## కీసర హోటల్‌లో అగ్ని ప్రమాదం

**కీసర,ఆగస్టు20,ప్రభాతవార్త:** కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈసిఐఎల్ ప్రధాన రహదారిపై ఉన్న సవరణ సుప్రభాత్ హోటల్‌లో గురు వారం తెల్లవారు జామున సిలిండర్ లీకేజీ కారణంగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది.గ్యాస్ సిలిండర్ నుంచి లీకేజీ కావడంతో ఒక్కసారిగా పెద్ద శబ్దం వినిపించి మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న సిఐ అర్కపల్లి ఆంజనేయులు పోలీస్ సిబ్బందిని అప్రమత్తం చేసి సంఘటనా స్థలానికి పంపించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తం అయ్యారు. హోటల్‌కి ఎదురుగా జేసీ ఆటోమొబైల్ (హీరో షోరూం) ఉన్న ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను ఉపయోగించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.కొద్ది సేపటికే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరుగపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.గ్యాస్ లీకేజీ గల కారణాలు అస్తి నష్టం తదితర వివరాలపై పోలీసులు విచారణ చేపట్టారు.



## ఉత్సాహంగా యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలు

**షాద్‌నగర్, ఆగస్టు 20, ప్రభాతవార్త :** టీజీటీడబ్ల్యూఆర్‌డీ అండ్ పీజీ కళాశాల (మహిళా), షాద్‌నగర్‌లో ఆగస్టు 12 నుంచి 18వ తేదీ వరకు యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో ర్యాగింగ్ పట్ల అవగాహన కల్పించేందుకు, ర్యాగింగ్ వల్ల కలిగే అనర్థాలను వివరించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు.వేడుకల కొనసాగింపుగా కళాశాల ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్లు, జూనియర్ల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించే ఉద్దేశంతో కబడ్డీ, సర్కిల్ గేమ్స్, ఖోఖో తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ క్రీడల్లో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. నీతా పోల్, యాంటీ ర్యాగింగ్ కన్వీనర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు కూడా విద్యార్థులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ కు పూర్తిగా దూరంగా ఉండాలని, పరస్పరం స్నేహభావంతో మెలగాలని సూచించారు. యాంటీ ర్యాగింగ్ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్ని కార్యక్రమాలను యాంటీ ర్యాగింగ్ కన్వీనర్ డా. ఎన్. శ్రీలత సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు అఫ్రోజ్ జహాన్ మరియు సయ్యద్ ముంతాజ్ కార్యక్రమాల నిర్వహణలో చురుకుగా పాల్గొన్నారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు కార్యక్రమాలను విజయవంతం చేయడంలో సహకరించారు.

## నిషేధిత భూముల జాబితాలను పరిశీలించాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 20, ప్రభాతవార్త :** 22ఎ నిషేధిత భూముల జాబితాలను జాగ్రత్తగా పరిశీలించి ప్రభుత్వం ఇచ్చిన జిఓలను అప్లోడ్ చేస్తూ యుఎల్‌సికి సంబంధించిన పెండింగ్ ధరఖాస్తులను క్లియర్ చేయాలని సంబంధిత అధికారులను మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. గురువారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని యుఎల్‌సి విభాగాన్ని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ 22ఎ నిషేధిత భూములు, అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యుఎల్‌సి) పరిధిలోని ధరఖాస్తులను క్లియరెన్స్‌కు రీటైనేబుల్ భూముల వివరాలను పరిశీలించి ప్రభుత్వ జిఓల ప్రకారం అప్‌లోడ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి హాల్‌లో వివిధ మండలాల నుంచి వచ్చిన సర్వేయరు,రెవెన్యూ సిబ్బంది, డిఐలు , కంప్యూటర్ ఆపరేటర్లు రాత్రి వేళ్లల్లో కూడ ఉండి పనులు పూర్తి చేయాలన్నారు. యుఎల్‌సి ఆన్‌లైన్ డేటాను త్వరగా క్లియర్ చేసేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. ధరఖాస్తుల ప్రక్రియను సత్వరమే పూర్తి చేసేందుకు రాత్రి వేళల్లోనూ సైతం పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE 4th ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE - TANUKU
E.P.18/2025 IN O.S.3/2018
Between:
Dr. BHAVANAM BRAHMA REDDY ... Plaintiff /D.H.R
and
PODURI VENKATA NAGA SOMESWARA RAO And Another ...Defendants /JDRs
JDR 1 : PODURI VENKAT NAGA SOMESWARA RAO S/o. Appa rao, Door No.6-5-266,Plot No.77, S.FColony,Vaidyhi Nagar, Hyderabad -500070, Telangana, State, R.R.District.
పై నెంబరు గ్రంధములో D.H.R షెడ్యూలు దాఖలా ఆస్తి Sale చేయించి మని కోరినందున మీరు Order21, Rule 64 నోటీస్ తీసుకోకుండా evade చేయుచున్నందున ది.25.08.2026 ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై Proclamation of Sale Terms తెలుసుకోవలెను.
Tanuku Dt.19.08.2026
D.RADHA,B.A.,BL Advocate, Tanuku Cell : 98850 12183

# కానిస్టేబుల్‌పై మద్యం మత్తులో వ్యక్తి దాడి

.. తీవ్ర గాయాలు

**ధారూర్,ఆగస్టు 20, ప్రభాతవార్త:** విధుల్లో ఉండి అత్యవసర సహాయం కోసం వచ్చిన కాల్స్‌పై స్పందించిన ఒక పోలీసు కానిస్టేబుల్‌పై మద్యం మత్తులో ఉన్న వ్యక్తి ఇటుకతో దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన ధారూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి ధారూర్ పరిధిలోని కొండాపూర్ కాలనీకి చెందిన ఓ మహిళ డయల్ 112కు కాల్ చేయగా, ఆ సమయంలో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ రాందాస్, హోంగార్డ్ నారాయణ వెంటనే స్పందించి ఆ గ్రామానికి వెళ్లి వచ్చారు. ఆ తర్వాత అదే ప్రాంతానికి చెందిన గట్టేపల్లి లాలయ్య అనే వ్యక్తి కూడా పదేపదే డయల్ 112కు ఫోన్ చేశాడు. దీంతో పోలీసులు అతని ఆరా తీసేందుకు మళ్లీ ఆ గ్రామానికి వెళ్లారు.పని ముగించుకుని తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో రోడ్డు పక్కన లాలయ్య నడుచుకుంటూ వెళ్తుండటాన్ని పోలీసులు గుర్తించారు. వెంటనే కానిస్టేబుల్ రాందాస్, హోంగార్డ్ నారాయణ అతని వద్దకు వెళ్లి ఎందుకు పదేపదే డయల్ 112కు ఫోన్ చేస్తున్నావని ఆరా తీశారు. ఈ క్రమంలో అప్పటికే మద్యం సేవించి ఉన్న లాలయ్య పోలీసుల ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ఆగ్రహంతో ఊగిపోయాడు. పక్కనే ఉన్న ఇటుకను తీసుకుని కానిస్టేబుల్ రాందాస్‌పై విచక్షణా రహితంగా దాడి చేశాడు.ఈ దాడిలో రాందాస్ తలకు తీవ్ర గాయాలై రక్తస్రావం కావడంతో నిందితుడు లాలయ్య అక్కడి నుంచి పరారయ్యాడు. అప్రమత్తమైన హోంగార్డ్ నారాయణ వెంటనే ఇతరుల సహాయంతో క్షతగాత్రుడైన రాందాస్‌ను వికారాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు, మెరుగైన వైద్యం కోసం అతన్ని హైదరాబాద్‌లోని ఆసుపత్రికి రిఫర్ చేశారు. హోంగార్డ్ నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సున్నం రాఘవేందర్ తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడు లాలయ్య కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు ఆయన వెల్లడించారు.


గాయపడిన కానిస్టేబుల్ రాందాస్

# ప్రాథమిక విద్యే మన భవిష్యత్తు

జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘనీ


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి ఘని

**ధారూర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** ధారూర్ మండల పరిధిలోని కుక్కింద ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయుల విద్యా సముదాయ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘనీ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాథమికవిద్యలో నాణ్యతను పెంపొందించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు. విద్యార్థులకు అభ్యసనమే ఊపిరిగా, బలమైన పునాదులే లక్ష్యంగా బోధన అందించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి ప్రభుత్వ ఆదేశాలను ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సోమి రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి ఎం. చెన్నయ్య, విద్యా సముదాయ ప్రధానోపాధ్యాయులు కడియాల వెంకట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో

# సివిల్ ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకం

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** సమాజ అభివృద్ధిలో సివిల్ ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని జెఎల్ఎల్ ప్రాజెక్టు డైరక్టర్ ఎ. శ్రీనివాస రావు అన్నారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫస్ట్ ఇయర్ విద్యార్థుల కోసం ఇండక్షన్ ప్రోగ్రామ్ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జెఎల్ఎల్ ప్రాజెక్టు డైరక్టర్ పాల్గొని మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులకు నిర్మాణరంగం, మౌళిక వసతుల అభివృద్ధి, ప్రాజెక్టు మేనే జ్‌మెంటు కన్సల్టెన్సీ, రియల్ ఏస్టేట్ తదితర రంగాల్లో ఉన్న విస్తృత్తమైన కేరీర్ అవకాశాలను వివరించారు. సురక్షితమైన భవంతులు, రహ దారులు, వంతెనలు, మౌళిక సదుపాయాల రూపకల్పన, నిర్మాణం వంటి నిర్వహణలో సివిల్ ఇంజినీర్లు కీలక బాధ్యతలు నిర్వర్తిస్తారని అన్నారు. విద్యార్థులు అకడమిక్ పరిజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, టెక్నికల్ స్కిల్స్, కమ్యూనికేషన్స్ స్కిల్స్, ప్రొఫెషనల్ ఎథిక్స్ పెంపొందించుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం నేర్చుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ హెడ్ పల్లవి బాద్రి, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ విజయ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అనురాగ్ యూనివర్శిటీలో నిర్వహించిన ఇండక్షన్ ప్రోగ్రామ్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన జెఎల్ఎల్. ప్రాజెక్టు డైరక్టర్ శ్రీనివాస్‌రావుకు మెమెంటో అందజేస్తున్న సివిల్ ఇంజినీరింగ్ హెడ్ పల్లవి బాద్రి.

# బిఎల్‌ఓలకు రెమ్యునరేషన్ చెల్లించాలి

..ఎంసిపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం

**శామీర్‌పేట, ఆగస్టు 20, ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి మండల పరిధిలో 2023, 2024, 2025 సంవత్సరాల్లో బూత్ లేవల్ ఆఫీసర్(బిఎల్ఓ) విధులు నిర్వహించిన సిబ్బందికి రావాల్సిన పెండింగ్‌లో ఉన్న రెమ్మునరేషన్ బకాయిలు చెల్లించాలని మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ ఎండి గులాం ఇద్రీస్‌కు తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు జిల్లా అధ్యక్షు రాలు జి.సునీత వినతి పత్రాన్ని అందజేశారు. గురువారం మూడు చింతలపల్లి మండలతహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎండి గులాం ఇద్రీస్‌ను కలిసి ఆమెతో పాటు పలువురు బిఎల్ఓ లు పాల్గొని వినతి పత్రాన్ని అందజేశారు. గత మూడేళ్లుగా ఓటర్ల జాబితా సవరణ, ఇంటింటి సర్వే, ఓటర్ల వివరాల పరిశీలన, ఎన్నికల ప్రక్రియలకు సంబంధించిన పలు బాధ్యతలను బాధ్యతాయుతంగా నిర్వహించామని, బిఎల్ఓలుగా విధులు నిర్వహించి ఏళ్లు గడుస్తున్నా మూడేళ్ల నుంచి బకాయిలు ఇవ్వటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్‌లో ఉన్న రెమ్యునరేషన్ బకాయిలు చెల్లించాలని వారు కోరారు. పరిశీలించి వెంటనే బిఎల్ఓల బ్యాంకు ఖాతాల్లో రూపాయలు జమ చేయాలని తహసీల్దార్‌ను వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు మంజుల, సంధ్యారాణి, అనిత, తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు జి.సునీత, తదితరుల దృశ్యం

# దయనీయ స్థితిలో కేసారం బస్టాప్

.... నిర్లక్ష్యం నీడలో కేసారం

....ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ప్రయాణికుల అవస్థలు

....అధికారులు ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం

**మోమిన్‌పేట్, ఆగస్టు 20, ప్రభాతవార్త:**

వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలంలోని కేసారం గ్రామంలో ఉన్న ప్రయాణ ప్రాంగణ పరిస్థితి దయనీయంగా మారింది. సుమారు 2,500, జనాభా కలిగిన కేసారం గ్రామంలో ప్రయాణికుల కోసం కనీస సౌకర్యాలు కల్పించకపోవడంపై గ్రామస్తులు తీవ్రఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్సులకోసం వేచి ఉండే ప్రయాణికులకు కనీసం నిలువనీడ కూడా లేకపోవడంతో ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. రోడ్డుపక్కనే నిలబడి ప్రయాణం కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది......బస్టాప్ ఉందా....లేక ప్రజల సహనానికి పరీక్షా.... కేసారం గ్రామం నుంచి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు వికారాబాద్, సంగారెడ్డి, సదాశివపేట, తాండూర్, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఉద్యోగాల కోసం వెళ్లేవారు, చదువుల కోసం విద్యార్థులు, వైద్య సేవల కోసం ఆసుపత్రులకు వెళ్లే రోగులు, వారి కుటుంబ సభ్యులు నిత్యం బస్సులపై ఆధారపడుతున్నారు.

ఇంతటి రాకపోకలు ఉన్న గ్రామంలో ప్రయాణికులకు కనీసం ఒక సౌకర్యవంతమైన బస్టాప్ లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఉద్యోగం కోసం వెళ్లే వ్యక్తి ఉదయం బస్సు కోసం ఎండలో నిలబడాలి. విద్యార్థులు చదువుల కోసం వెళ్లేందుకు వర్షంలో తడవాలి.. ఆసుపత్రికి వెళ్లే రోగి కూడా రోడ్డుపక్కనే నిలబడాల్సిందేనా? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ప్రజల సమస్యలు పట్టించుకునే వారేరీ?..**

ప్రజలకు మౌలిక వసతులు కల్పించాల్సిన అధికారులు, ప్రజా ప్రతినిధులు కేసరం బస్టాండ్ సమస్యను ఇంతకాలం పట్టించుకోకపోవడం పట్ల గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వచ్చి హామీలు ఇచ్చే నాయకులు.. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న ఇలాంటి కనీస సౌకర్యాల సమస్యలను మాత్రం ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీస్తున్నారు.

వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. వర్షం కురిసినప్పుడు బస్సుకోసం నిలబడేందుకు సరైన ఆశ్రయం లేక ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, విద్యార్థులు, రోగులు మరింత అవస్థలు పడాల్సి వస్తోంది.

**....ఇకనైనా మేల్కొంటారా?..**

కేసరం గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వెంటనే నూతన బస్టాండును నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. బస్టాప్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు బెంచీలు, ఎండ-వాన నుంచి రక్షణ కల్పించే షెడ్, అవసరమైన ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే కేసరం గ్రామంలో ఒక బస్టాప్ నిర్మించేందుకు కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇంత నిరక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసం? ప్రజల అవసరాలు కనిపించాలంటే ఎన్ని రోజులు పడుతుంది? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కేసారం గ్రామంలో నూతన బస్టాండ్ నిర్మాణానికి చర్యలు చేపట్టి ప్రయాణికుల కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.




శిథిలావస్థలో కేసారం గ్రామ ప్రయాణ ప్రాంగణం ఫొటో.

# జాతర ఏర్పాట్లను పర్యవేక్షించిన మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్

మేడ్చల్, ఆగస్టు 20. ప్రభాతవార్త : మేడ్చల్ పట్టణంలో ఈ నెల 23 వ తేదీ ఆదివారం నిర్వహించే శ్రీ గడిమైసమ్మ తల్లి శ్రావణమాస బోనాల పండుగను పురస్కరించుకొని జీహెచ్ఎంపీ మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుదాంష్ దేవాలయానికి విచ్చేసి పనులును పర్యవేక్షి ంచారు. దేవాలయ ప్రాంగణంలో శుభ్రం చేయించి, గుంతలు లేకుండా చదును చేయించి, లైట్లను రిపేరు చేయించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కాకుండా చర్యలు తీసుకుంటున్నామని, నీటి సమస్య, లైట్ల సమస్య లేకుండా చూశామన్నారు.


మేడ్చల్‌లోని గడిమైసమ్మ తల్లి ఆలయం వద్ద పనులను పర్యవేక్షిస్తున్న డీసీ సుదాంష్


మాట్లాడుతున్న ధారాసింగ్

# బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలి

..డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్

**పెద్దేముల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** గ్రామ కమిటిలు పార్టీకి పునాది అని, బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు జాదవ్ ధారాసింగ్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం పెద్దేముల్ మండలం జైరాంతాండా (ఐ) ఇందూరు గ్రామాలలో మండల పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్‌రెడ్డి అధ్వర్యంలో కొనసాగుతున్న విలేజ్ కాంగ్రెస్ కమిటిల నియామక ప్రక్రియను వికారాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు ధారాసింగ్ నాయక్ పరిశీలించారు. నూతనంగా నియమితులైన గ్రామ కమీటిల అధ్యక్ష, కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా ధారాసింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని అన్నారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను అధిష్టానం గుర్తిస్తుందని అన్నారు. జై రాంతాండా ( ఐ) గ్రామ కమిటి అధ్యక్షులుగా భద్రం, ఉపాధ్యాక్షులుగా కే.మోహన్, జాయింట్ సెక్రటరిగా సక్కుబాయి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షులు నర్సిరెడ్డి, కార్యవర్గసభ్యులు గోపాల్, ఏ బ్లాక్ అధ్యక్షులు లొంక నర్సిములు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నారాయన్‌గౌడ్, గ్రామ సర్పంచ్ వెంకట్, సీనియర్ నాయకులు మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, రియాజ్, నర్సిములు, జగన్, శ్రీనివాస్, గ్రామకమిటి అధ్యక్షులు చంద్రశేఖర్, సర్పంచ్‌లు సురేష్ నాయక్, రాములు, యువనాయకులు మహేష్, శ్రావన్, హర్షవర్ధన్, శాంతు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీలో అభివృద్ధి పనులపై వివాదం

**ధారూర్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** ధారూర్ గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయమై సర్పంచ్, ఉప సర్పంచ్ ఏకపక్ష వైఖరిని నిరసిస్తూ వార్డు సభ్యులు జిల్లా పంచాయతీ అధికారికి (డి.పి.ఓ.) గురువారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ధారూర్ గ్రామ పంచాయతీ ప్రధాన రోడ్లలో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ (యు.జి.డి.) పనుల గురించి చర్చించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పనుల పారదర్శకత గురించి వార్డు సభ్యుడు జాకీర్ తదితరులు ప్రశ్నించగా, సర్పంచ్, ఉప సర్పంచ్ ఇద్దరూ తీవ్రంగా దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. అభివృద్ధి పనుల గురించి నిల దీసే హక్కు మీకు లేదని, తమకు ఇష్టం వచ్చినట్లు పనులు చేసుకుంటా మని వారు తమను అవమానపరిచారని జాకీర్ వాపోయారు. గతంలో చేపట్టిన పనులకు సంబంధించి కూడా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, వార్డు సభ్యులను సంప్రదించకుండా బిల్లులు ఎత్తుకుంటున్నారని వారు మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వార్డు సభ్యుల హక్కులను కాలరాస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్‌ల తీరుపై వెంటనే విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డి.పి.ఓ.ను కోరారు. ఈ కార్యక్రమంలో ధారూర్ గ్రామ పంచాయతీకి చెందిన పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# రాష్ట్ర కేబినెట్‌లో అవకాశం ఇవ్వండి

**పరిగి, ఆగస్టు 20, ప్రభాతవార్త :** ఢిల్లీ పర్యటనలో భాగంగా అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేను గురువారం , పరిగి ఎమ్మెల్యే,టిపిసిసి ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర కేబినట్ లో తనకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ,ఖర్గేను కోరారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో జురుగుతున్న కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు,సంస్థాగత వ్యవహారాలపై ఖర్గేకు టి.ఆర్.ఆర్ .వివరించారు.. తెలంగాణ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ష్టాత్మకంగా నిర్వహించామని , అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును జాబితా లో ఉండేలా, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును తొలగించకుండా క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తామని తెలిపారు. అదేవిధంగా రాజీవ్ గాంధీ జయంతి సందర్బంగా డిల్లీలోని వీర్ భూమి వద్ద రాజీవ్ గాంధీ సమాధికి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నివాళులు సమర్పించారు.


ఏఐసిసి అధ్యక్షులు ఖర్గేతో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

# నేడు డయల్ యువర్ డిఎం

**మేడ్చల్, ఆగస్టు 20, ప్రభాతవార్త :** ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, వారు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకుగాను నేడు డయల్ యువర్ డీఎం కార్య క్రమం నిర్వహించనున్నట్లు మేడ్చల్ డిపో మేనేజర్ పరిమళ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిదంగా ఇతర పలు అంశాలపై ప్రయాణికుల నుంచి తగిన సూచనలు, సలహాలు స్వీకరించేందుకు గాను నేడు మధ్యాహ్నం 12 గంటల నుండి 1 గంట వరకునిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొని 9959226152నంబర్‌కు ఫోన్‌చేసి తమ సమస్యలు, సూచన సలహాలను తెలియజేయాలని డిఎం కోరారు.

# ఉల్లాస అమ్మకు అక్షరమాలపై అవగాహన శిక్షణ

**శామీర్‌పేట, ఆగస్టు 20, ప్రభాతవార్త:** అక్షరాస్యతను పెంపొందించటానికి ప్రజలను విద్యాకార్యక్రమాల్లో భాగస్వాములను చేయటం ప్రధాన లక్ష్యమని, అవసరమని అంగన్‌వాడి టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి సూచించారు. గురువారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయం వద్ద పలువురు అధికారులు, రిసోర్సు పర్సన్‌లు అంగన్‌వాడి టీచర్లకు అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. ఉల్లాస అమ్మకు అక్షరమాల కార్యక్రమం టిఓఎస్ఎస్‌లో భాగంగా అలియాబాద్ మున్సిపాల్టీ కార్యాలయం వద్ద శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించి అవగాహన కల్పించారు. అర్హులైన వారికి విద్యా అవకాశాలు అందేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉల్లాస అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది, చురుగ్గా పనిచేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డితో పాటు డిఆర్‌డిఓ సాంబశివరావు, వయోజన విద్య డిడి అనిత, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్‌రెడ్డి, టిఓఎస్ఎస్ కోఆర్డినేటర్ సత్యనారాయన, టిఎల్ఎఫ్ అధ్యక్షురాలు లావణ్య, ఎడిఎంసి ఉమేశ్, సిసి నాగశ్రీ, పలువురు రిసోర్సు పర్సన్‌లు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.


అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ఉల్లాస అమ్మకు అక్షరమాల కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న డిఆర్‌డిఎ సాంబశివరావు, వయోజన విద్య డిడి అనిత, అధికారులు, సిబ్బంది తదితరుల దృశ్యం


రాష్ట్ర పంచాయతిరాజ్ కమిషనర్ దివ్య ఐఏఎస్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్ష, కార్యధర్ములు భూమన్న, కీర్తిరామకృష్ణ తదితరులు

## సర్పంచుల సమస్యలపై రాష్ట్ర పంచాయితిరాజ్ కమిష్నర్‌కు వినతి

**మోమిన్‌పేట్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** గ్రామాలు అభివృద్ధి చెందడానికి ప్రథమపాత్ర పోషిస్తున్న ఏకైక వ్యక్తి, గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచులు. అలాంటి పాత్ర పోషిస్తున్న సర్పంచులకు అధికార ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు కల్పించాలని అంటూ వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం కోల్కుంద గ్రామంలో ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యధర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం కీర్తిరామకృష్ణ, రాష్ట్ర సర్పంచుల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు భూమన్నతో కలిసి పంచాయతి సమస్యలపై గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో డి. దివ్య ఐఏఎస్ కమిషనర్ పంచాయతీ రాజ్ అండ్ రూరల్ ఎంప్లాయిమెంట్ సిఈఒను కలిసి సర్పంచుల సమస్యలను వివరించారు. ఈ సందర్బంగా సర్పంచ్ల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘ వేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం కీర్తి రామకృష్ణ మరియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గ్రామాలలో తమకెదురౌతున్న సమస్యలు, అధికార ప్రభుత్వం యొక్క వైఖరితో గ్రామాలలో అభివృద్ధి పనులు చేయలేక పోతున్నామని, ఒకవేళ ఏదైనా గ్రామానికి సంబందించిన చిన్న చిన్న పనులు చేపట్టినా.....ప్రతిపక్ష వర్గనేతలు అడ్డుకోవడం, లేదా దౌర్జ్యన్యాలకు పాల్పడడం, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వ్యవహించడంతో గ్రామాలలో ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలన్నా ఇబ్బందికరంగా ఉందని రాష్ట్ర పంచాయతిరాజ్ కమిషనర్ దివ్య, మరియు సిఈఒలకు లిఖిత పూర్వకంగా వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్బంగా అధికారులు సానుకూలంగా స్పందించి, గ్రామాలలో సర్పంచులకుండే సర్వాధికారాలు ప్రభుత్వపరంగా స్వేచ్ఛా హక్కులు ఉంటాయని కనుక తమ సమస్యలపట్ల స్పందించి, సర్పంచులుగా తమ బాధ్యతలను స్వేచ్ఛగా నిర్వహించాలని, అందుకు ప్రభుత్వపరంగా ఎల్లవేళలా అండగా మేమున్నామని తెలిపినట్లు తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యధర్శి, కోల్కుంద మహిళా సర్పంచ్ కరణం కీర్తి రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం నాయకులు, పలు మండలాల సర్పంచుల సంఘం అధ్యక్ష కార్యధర్ములు, రాష్ట్ర పంచాయతిరాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అబ్బుర పరిచిన గణిత అవధానం

**యాలాల ఆగష్టు 20,ప్రభాతవార్త :** గురువారం తాండూరు పట్టణంలోని ద శాస్త్ర పాఠశాలలో ఏర్పాటు చేసిన కళ్లకు గంతలతో గణిత అవధానం కార్యక్రమం అబ్బుర పరిచాంది.విద్యార్థుల్లో గణితం పట్ల ఆసక్తి, మక్కువ కలిగించేందుకు ఏర్పాటు చేసిన ఈ గణిత అవధానం కార్యక్రమాన్ని రాష్ట్రపతి అవార్డు గ్రహిత,రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు అనంతప్ప యాదవ్ విద్యార్థులకు పలు మెళుకువలు నేర్పించారు.మొదటగా మెమోరీ శతావధానం లో భాగంగా విద్యార్థులను ఒకటి నుండి వందవరకు నెంబర్లు బోర్డుపై రాసి విద్యార్థులు చెప్పిన వివిధ రకాల పేర్లు,ఆ అంకెల ప్రకారం వర్తింపజేసి కళ్లకు గంతలు కట్టుకొని వాటిని ఒకటి నుండి వంద వరకు వరుసగా ఆ పదాలను ఆరోహన,అవరోహాన క్రమంలో చెప్పడం విశేషం.అలాగే తేదీ చెబితే వారం చెప్పడం తదితర అంశాలను విపులంగా వివరించారు.దాంతోపాటు విద్యార్థుల్లో జ్ఞాపక శక్తిని,ఏకాగ్రతను పెంపొందించుకోవడానికి పలు సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంతో పిల్లల్లో గణితం పట్ల ఆసక్తి పెరుగుతోందని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్లు ప్యాట సుభాన్‌రెడ్డి,జగన్నాథ్‌రెడ్డి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.శ్రీశైలం,అకడమిక్ ఇంచార్జీ హరిత ,ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంఠం ప్రాంతాలకు

# రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయాలి

**జవహర్ నగర్,ఆగస్టు20,ప్రభాత వార్త:** జవహర్ నగర్ గ్రామకంఠం ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.20కోట్ల నిధులు మంజూరు చేసి,భూగర్భ డ్రైనేంజి,సిసి రోడ్ల నిర్మాణ పనులకు అనుమతులుఇవ్వాలని డిసిసి అధ్యక్షుడు వజ్రష్ యదవ్,జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షురాలు,మాజి మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ కోరారు.ఈమేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పోరెషన్ కమిషనర్ వినయ్ కృష్ణరెడ్డికి వినతిపత్రం అంద జేశారు. ఈసందర్భంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ గ్రామకంఠం పరిధిలోని పలుకాలనీల్లో భూగర్భ డ్రైనేజీ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి చేరుతుందని తెలిపారు.సిసి రోడ్లు శిధిలావస్థకు చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.వర్షకాలంలో మురుగు నీరు నిలిచి దోమలు పెరగడంతో అంటువ్యాధుల భయం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసి పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. శాంతి కోటేష్ గౌడ్ మాట్లాడుతు గ్రామపంచాయతీ నుంచి కార్పోరెషన్‌గా ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా గ్రామకంఠం ప్రాంతాలు ఆశించిన స్థాయిలో అభవృద్ధికి నోచుకోలేదన్నారు. కాలనిల్లో మౌలిక వసతుల సమస్య లను పరిష్కరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించి భూగర్భ డ్రైనేజి,సిసి రోడ్ల పనులు చేపట్టాలని కోరారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్,మాజి ఎంపిటిసి బోబ్బిలి మంజుల,యువజన సంఘం అధ్యక్షుడు మాట్ల వినయ్‌కుమర్,నాయకులు గజ్వేల్ శంకర్,చింతల ప్రేమల్,శ్రినివాస్,వెంకటేశ్వర్లు,సుబ్రమణ్యం,సాయి,విజయరాయితో పాటు పలువురు పాల్గొన్నారు.

కేశంపేటలో సింగిల్ విండో డైరెక్టర్

# ఏర్పుల లింగం ముదిరాజ్ జన్మదిన వేడుకలు

**కేశంపేట, ఆగస్టు 20, ప్రభాతవార్త :** కేశంపేట మండల కేంద్రంలోని మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో సింగిల్ విండో డైరెక్టర్ ఏర్పుల లింగం ముదిరాజ్ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా స్థానిక నాయకులు శాలువాతో సన్మానించి, కేక్ కట్ చేసి లింగం ముదిరాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.మండలంలో సహకార రంగానికి, రైతు సంక్షేమానికి ఆయన సేవలను అందించాలని ఈ సందర్బంగా పలువురు నాయకులు అన్నారు. ప్రజా సేవలో, పార్టీ అభివృద్ధిలో ఎల్లప్పుడూ ముందుంటూ అందరితో ఆప్యాయంగా ఉండే లింగం ముదిరాజ్ మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని, నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్ష ంచారు.అనంతరం లింగం ముదిరాజ్ మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా అభిమానంతో వేడుకలు నిర్వహించిన ప్రతి ఒక్క కాంగ్రెస్ నాయకుడికి, కార్యకర్తకు, మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు, రైతులకు అండగా ఉంటూ సేవ చేయడమే తన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, బీసా కరుణాకర్ రెడ్డి, తుమ్మల గోపాల్ ముదిరాజ్, రావుల పెంటయ్య ముదిరాజ్, రాజేందర్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, వట్టెల లింగం ముదిరాజ్, తిప్పిశెట్టి సుదర్శన్, భాస్కర్ మంచ వెంకటయ్య, స్వేరో లింగం, కోడూరు శ్రీశైలం, ఆంజనేయులు, సాయిలు, అభిమానులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

# రహదారుల నిర్మాణం,మరమ్మతులు వేగవంతం

**పరిగి, ఆగష్టు 20, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా, పరిగి మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో అవసరమైన రహదారుల నిర్మాణాలను, రహదారుల మరమ్మతుల పనులను వేగవంతంగా పూర్తిచేస్తామని పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజితవెంకటేష్ తెలిపారు .గురువారం , పరిగి మున్సిపల్ పరిధిలోని 6వవార్డు ఎర్రగడ్డపల్లిలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను రజితవెంకటేష్ పరిశీలించారు.. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చొరవతో పలురోడ్లను నిర్మిస్తున్నామని,ఎర్రగడ్డపల్లి,సుల్తాన్ నగర్, నారాయణపూర్ మార్గాలలో రాక పోకలు సులభతరం అవ్వనున్నాయని తెలిపారు.పనుల నాణ్యతపై అధికారులకు పలు సూచనలు చేశారు.కౌన్సిలర్లు షాహెదా బేగం,అక్బర్ హుస్సేన్ , పరిగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకట్ రాములు,జగన్ ,నవాజ్, సర్ఫరాజ్ ,విజయలక్ష్మి ్మ , తదితరులు పనులను పరిశీలించారు

